

# రెక్కలు

## కాటూరు రవీంద్ర త్రివిక్రమ్

వేప చెట్టు మీద చేరిన కాకుల సుప్రభాత గీతాలకి సీతాలు కళ్లు తెరిచింది. తెరుస్తూనే ఎదురుగా ఉన్న మేడ కేసి చూసింది. ఆ మేడ మీద వరండాలో ఆ ఇంటి వారి ముద్దుల బిడ్డ రాజ్యం, ఇంగ్లీషు పాటాలు పాడుకుంటూ అటు-ఇటు పచార్లు చేస్తోంది. చలిని వెక్కిరిస్తున్న ఖరీదయిన స్వెట్టరు... నెత్తి మీద అందంగా అమరిన ''కోతి టోపీ'' ... బొద్దుగా, ముద్దుగా ఉన్న రాజ్యం అలా తిరుగుతుంటే - సీతాలుకి ఇంకా ఇంకా చూడాలనిపిస్తుంటుంది.

ఆ మేడ యజమాని ఠీవికి అద్దంపడుతోంది.

అందులోని మనుషులు ఆనందానికి తామే హక్కుదార్లయినట్లు కేరింతలు కొడుతుంటారు.

చివరికి ఆ ఇంట్లోని కుక్క సైతం తన ఆనందాన్ని అరుపుల ద్వారా వ్యక్తీకరించకుండా ఉండలేదు.

రాత్రంతా స్వేచ్ఛగా విహరించిన చలి పులి ఉదయం కాగానే చెట్ల చాటుకు పారిపోయింది.

చెత్త కుండీ దగ్గర చేరిన వీధి కుర్రాళ్లు నూనె గుడ్డలు

కాలుస్తూ చలిని భయపెడుతున్నారు. మధ్య మధ్యలో పిచ్చి వాగుడు వాగుతూ నవ్వుకుంటున్నారు!

సర్కస్‌లో బఫూన్స్ మాదిరి వేషాలతో కూర్చున్న వాళ్లని చూస్తూ సీతాలు నవ్వుకుంది. ఒకడి నెత్తిమీద కాగితం నంచీ టోపీలా ఉంటే, మరొకడి చెవులో సగం కాలిన బీడీ ఉంది. ఇంకొకడు ఒక కాలికి చెప్పు, మరో కాలికి బూటు వేసుకున్నాడు. వాళ్ల చింకి చొక్కాలు చలి పంజాకి చిరిగిన ఆత్మ గౌరవంలా ఉన్నాయి.

వేప చెట్టు పాదాల మీద కూలబడి, సగం ఎండిపో యిన వేపుల్లని నములుతుండిపోయింది సీతాలు. అలా నములుతూనే గతం నెమరు వేసుకోవడం సీతాలుకి ఒక దిన చర్యగా మారింది. చాలా మందికి లాగానే సీతాలుకి తన వంశవృక్షం తెలియదు. కళ్లు తెరిచే ముందు కథేమిటో తెలియదు కానీ, ఆ తర్వాత ఓ ముసలాడు సీతాలుకి సంరక్షకుడయ్యాడు. ప్రేమగానే చూసేవాడు.

ఎండకి, వానకి సగం రక్షణ కల్పించే రేకుల పందిరి నొకదాన్ని వేప చెట్టు మొదట్లో ఏర్పాటు చేశాడు. ఆ వేప చెట్టుకి రోడ్డుతో విరోధం ఉన్నట్లు కాస్త ఎడంగా ఉంటుంది. అందుకే బ్రతికిపోయింది! లేకపోతే, రోడ్డు మింగేసిన చెట్లలో అదీ ఒకటి అయ్యేది.

ముసలాడికి, రోడ్డుకి గొప్ప స్నేహం. ఇళ్లలో పనికిరావనిపించినవన్నీ రోడ్డు నెత్తినపడేవి. వాటిని ఏరుకుని సొమ్ము చేసుకునేవాడు ముసలాడు. కొన్ని తెచ్చి తన గూడులో ఉంచేవాడు. సీతాలు వాటితో ఆడుకునేది. ఆకలి అడుక్కోవడం నేర్చింది గనుక, కాంతి తరిగిన సత్తు గిన్నె పుచ్చుకుని ఇల్లిల్లూ తిరుగుతుండేది. చింకి జుట్టు, చిరిగిన బట్టలు, బీదరికం ఎదగనివ్వని శరీరంతో సీతాలు జాలిని మేలుకొలిపేది. కానీ, వాననలేని పువ్వుల్లాంటి మానవత్వం లేని మనుషులు కొందరు సీతాలుని చీదరించుకునేవాళ్లు.


మొదట ఆ పసి మనసు చిన్నబోయినా, మెల్లగా అలవాటుపడిపోయింది. వాళ్లెంత కసురుకున్నా తననే కానట్లు తాపీగా నడచిపోయేది సీతాలు.

ఒక శీతాకాలం - ముసలాడిని చలిపులి వేటాడి తినేసింది. సీతాలు వంటరిదయిపోయింది. మొదట్లో - రాత్రిళ్లు గుబులు గుబులుగా గడిపేది. పీడకలలు పీడించేవి. కొన్నాళ్లు తోటి పిల్లలు సాయంపడుకున్నారు. ఆ తర్వాత వంటరితనం అలవాటయిపోయింది. భయం పారిపోయింది. మొండితనం ఆక్కరకొచ్చింది.

సీతాలుకి ఎదురుగా ఉన్న మేడని చూస్తుంటే సినిమా చూస్తున్నట్లే ఉంటుంది. అందుకే కళ్లప్పగించి పొద్దస్తమానం ఆటే చూస్తుంటుంది. అందమయిన గేటు... అందులో వచ్చని నేల, రంగు రంగుల పూలతో నవ్వే చెట్లు, నగిషీలతో, మెరుగులతో ఠీవిగా వెలిగిపోయే మేడ... ఆ మేడలో అందంగా, ఆనందంగా అటు ఇటు తిరిగే మనుషులు... అన్నింటికంటే అధికంగా రాజ్యం అంటే సీతాలుకి మరీ మక్కువ.

తనూ ఆ ఇంట్లో పుట్టి ఉంటే... రాజ్యంలాగానే మంచి మంచి బట్టలు వేసుకునేది... కోరిన తిండి తినేది. మెత్తటి పరుపుల మీదపడుకుని, వెచ్చని దుప్పట్లు కప్పుకునేది. ఇలాంటి ఆలోచనలతో సతమతమవుతుండేది. అలాంటి కలలే కంటుండేది. కలలు కరిగిపోయాక మిగిలిన వాస్తవికత క్రుంగదీసేది... అంతలోనే తేరుకుని మళ్లీ జీవితంలోకి నడిచేది.

ఓమాటు అనుకోకుండా రాజ్యానికి, సీతాలుకి పరి



### లంచం

"ఆఫీసులో ప్రతి పనికీ లంచం అడుగుతున్నారని మీమీద ఫిర్యాదులు వస్తున్నాయి! ఇకమీదట మీరు లంచం తీసుకున్నట్లు తెలిస్తే మిమ్మల్ని సస్పెండ్ చేస్తాను" అన్నాడు ఆఫీసర్ క్లర్కుతో.

"ఏం చెయ్యమంటారు సార్! నేను లంచం ఇచ్చి చదువుకున్నాను, లంచం ఇచ్చి పాసైనాను! ఆఖరుకి ఈ ఉద్యోగం కూడా లంచం ఇచ్చి సంపాదించుకున్నాను."

శ్వేత [గుంటూరు]

చయం అయింది. ఆ రోజు ఆదివారం. రాజ్యం బంతి ఆట ఆడుతుండగా అధి రోడ్డు దాటి సీతాలు కుటీరానికి వచ్చి తగిలింది. దాని తాకిడికి అక్కడున్న సామాన్లు చెదిరినాయి. బంతి వెనకాలే పరుగెత్తుకొచ్చిన రాజ్యం వైపు ఆశ్చర్యంగా కన్నార్పకుండా చూస్తుండిపోయిన సీతాలు "నా బంతి ఇవ్వవూ?" అని ముద్దుగా అడుగుతున్న మాటలకి తేరుకుని, గబగబా బంతి తెచ్చి ఇచ్చింది.

అందుకుంటూ "థాంక్యూ" అంది నవ్వుతూ రాజ్యం.

అంటే ఏమిటో తెలియని సీతాలు బోళాగా నవ్వింది.

"నీ పేరేమిటి?"

"సీతాలు..."

"నువ్వే స్కూల్లో చదువుతున్నావ్?"

### బహుభాషా కోవిదుడు

మనిషి ఒకటి రెండు భాషలను పూర్తిగా అభ్యసించలేకపోతున్నాడు. ఒకటి కాదు శతాధికంగా భాషలు నేర్చినవారు ఉన్నారంటే మనకు ఆశ్చర్య మేస్తుంది. ఇటలీ దేశానికి చెందిన 'కార్డినల్ మెజోపంటి' అన్న వ్యక్తికి 115 భాషలు వచ్చునట. ఐరోపా దేశ భాషలన్నీ నేర్చుకున్నాడట చైనీస్, జపనీస్, టర్కిష్, హిందీ, సంస్కృతం భాషల్లో మంచి నిష్ణాతుడు. ఇతను పుస్తకం ఒకసారి చదివితే జ్ఞాపకం ఉంచుకొని అవసరమొచ్చినప్పుడు తన ప్రజ్ఞను ప్రదర్శించేవాడట. రోజూ మూడు గంటలు మాత్రమే నిద్రపోయేవాడు. క్రైస్తవ మత బాధ్యతలు నిర్వహిస్తూనే భాషా ప్రవీణుడైనాడు. 1849 మెజో మరణం నాటికి అతడు నేర్చుకున్న భాషలు 115.

పట్నం శేషంశెట్టి [నంద్యాల]

సీతాలు సిగ్గుపడి తలొంచుకుంది. తనది బ్రతుకుబడి అని ఆ పిల్లకే తెలియదు గనుక చెప్పలేకపోయింది.

"చదువుకోటం లేదా?" మళ్లీ ప్రశ్న.

'లేదు' అన్నట్టు తల అడ్డంగా తిప్పింది.

"మీ అమ్మా నాన్నా ఎక్కడున్నారు?"

ఆ ప్రశ్నే తను అడగాలనుకుంటోందని, ఎవర్నడగాలో తెలియడంలేదని మనసులో అనుకుంది. మాటల్లో చెప్పలేకపోయింది సీతాలు. ముసలాడినో మాటు అడిగితే జవాబుగా ఆకాశంకేసి చేతులు చూపించి ఓ పిచ్చి నవ్వు నవ్వాడు.

"ఆ దేవుడే నీకు అమ్మా నాన్నా సీతాలు! మనందరం చాలా గొప్పోళ్లమే... అందరిలాంటి అమ్మా నాన్నలు కాదు మనకి... అమ్మలకి అమ్మ మన అమ్మ... అయ్యలకి అయ్య మన అయ్య అది నిజం గాబట్టే మనం చెట్టు కిందయినా దిలాసాగా బతికేస్తున్నాం."

ఆ చిన్న బుర్రకి ఆ మాటల్లోని వేదాంతం అర్థంకాలేదు.

"నా పేరు రాజ్యం! నేను సిటీ పబ్లిక్ స్కూల్లో చదువుకుంటున్నాను..."

ఉలిక్కిపడింది సీతాలు...

'అలాగా' అన్నట్టు చూసింది.

అంతలో మేడ మీద నుండీ రాజ్యం తల్లి కూతుర్ని గట్టిగా కేకేసింది.

"మా అమ్మ పిలుస్తోంది... నే వస్తానేం" చెయ్యిగాల్లో ఊపుతూ, స్నేహంగా నవ్వుతూ వెళ్లిపోయింది రాజ్యం.

అప్రయత్నంగా సీతాలు కూడా గాల్లో చెయ్యి ఊపింది.

రాజ్యాన్ని తల్లి గట్టిగా మందలించింది -

"ఆ దరిద్రపు దానితో నీకు సొది ఏమిటే."

"బాల్ అటు పోయిందమ్మా..."

"దాన్ని పుచ్చుకోవడానికి వెళ్లిన దానివి, దాంతో మాటలేమిటి?"

"మాట్లాడితే తప్పా!"

"అవును! తప్పే! వాళ్లతో మనం కలవకూడదు... పద ఇంట్లోకి" గద్దించింది.

చెవులకి ములుకుల్లాగా తగిలాయా మాటలు.

ఎందుకు తమతో కలవకూడదు?

సీతాలుకి ముసలాడు బ్రతికున్నప్పుడు జరిగిన సంఘటన ఒకటి గుర్తొచ్చింది.

బజారు వెంట ఇద్దరూ వెళుతుంటే కుష్టువాడు ఎదురు వచ్చాడు. చప్పున తన చెయ్యి పట్టుకుని పక్కకి లాగేశాడు ముసలాడు.

బిత్తరపోయిన తనతో "కుష్టు వాళ్లకి దూరంగా ఉండాలి... ఆ రోగం మనక్కూడా అంటుకుంటుంది" అన్నాడు హెచ్చరిస్తూ.

కుష్టు వాడికీ, బీదవాడికీ తేడా లేదేమో!

బీదరికం కూడా కుష్టులాగానే అంటువ్యాధేమో... సీతాలు నిట్టూర్చింది.

★ ★ ★ ★

వీధి దీపాలు వెలిగాయి. చీకటి చిన్నబోయింది.

సీతాలు కళ్లు తెరిచింది. భగ్గున మండినట్లు, తల మీద ఎవరో సుత్తితో బాదుతున్నట్లు అనిపించింది. వళ్లు వెచ్చగా ఆవిర్లు చిమ్ముతూ, చలికి వణుకుతోంది. బల

మంచాన లేచి కూర్చుంది. వళ్లు తూలుతోంది.

ఎదురింటి మేద మీద నుండీ రేడియో పెద్దగా పాడుతోంది. సీతాలు కళ్లు రాజ్యం కోసం వెతికాయి. వరండా ఖాళీగా ఉంది. బహుశా లోపల ఉందేమో!

ఆశగా అటే చూస్తోంది. ఆమె నిరీక్షణ ఫలించినట్లు మరి కాస్సేపటికి రాజ్యం వరండాలోకి వచ్చింది. సీతాలు కళ్లు మిలమిలలాడేయి. రాజ్యం తనకేమయినా మందిస్తుందేమో... అవును... రాజ్యం మంచిది... వెళ్లి అడిగితే కాదనదు...

ఓపికంతా కూడగట్టుకుని గేటుదాకా వెళ్లింది. సీతాలుని చూడగానే రాజ్యం పరుగున వచ్చింది.

"సీతాలు... ఏం కావాలి?" అంది.

"నాకు జ్వరంగా ఉంది... మందు కావాలి..."

నుదుటి మీద చెయ్యి వేసి చూసింది. "అమ్మో... ఎంత వేడిగా ఉందో... ఇక్కడే ఉండు... మందు తెచ్చిస్తా..." ఇంట్లోకి పరుగున వెళ్లి చేతికందిన మందు తెచ్చి ఇచ్చింది.

"ఇది వేసుకో... తగ్గిపోతుంది.. మళ్లీ మా అమ్మ వస్తుంది... తొందరగా వెళ్లు..." భుజం మీద చెయ్యి వేసి సాగనంపింది.

సీతాలు గబగబా తన మకాముకి తిరిగి వచ్చింది. రాజ్యం ఇచ్చిన మాత్రలు నీళ్లతో మింగింది.

గోనె సంచీ మీద నడుం వాల్చి పాత బొంత కప్పుకుంది.

చలి పులి విహారం ప్రారంభించింది.

సీతాలుకి కుతూహలం కలిగి రాజ్యం మేడకేసి చూసింది. రాజ్యం కూడా మేడ మీద నుండీ వేప చెట్టు కేసి చూస్తోంది.

సీతాలు నవ్వుకుంది.

మెల్లగా నిద్రపట్టసాగింది.

నిద్రలో కల -

ఎటు చూసినా రంగు రంగుల పూలు...

తన వంటి మీద మిలమిల మెరిసిపోతున్న గౌను...

ఆశ్చర్యం! తన వీపున రెక్కలున్నాయి... అవి కదుల్తుంటే తను మెల్లగా గాలిలో తేలిపోతోంది. రాజ్యం మేడ వైపుగా వెళ్తోంది. రాజ్యం వెల్లబోయి తన కేసి చూస్తోంది... "సీతాలూ... సీతాలూ... నన్ను పట్టుకో..." అని అరుస్తోంది. సీతాలు చెయ్యి చాచింది. ఇద్దరి చేతులూ కలవడంలేదు.

గాలికి రెక్కలు కదలి, సీతాలు ఇంకా ఎత్తుకి ఎగురుతోంది.

"సీతాలూ... సీతాలూ..." అంటూ రాజ్యం పెద్దగా అరుస్తుండగానే ఇద్దరి మధ్యా దూరం ఎక్కువైపోయింది.

ఆ రాత్రి వాన కురిసింది.

వేప చెట్టు చుట్టూ నీళ్లు నిలిచాయి.

తెల్లారి కాకులు యధాప్రకారం వచ్చి వాలేయి.

ఎదురు మేడ మీద నుండి రాజ్యం సీతాలు కోసం ఆందోళనగా చూసింది. జ్వరం తగ్గే మాత్రలనుకుని, అమాయకంగా రాజ్యం తన తండ్రి వాడే నిద్రమాత్రలు ఇవ్వడంతో - వాటిని ఒక్కమాటే మింగిన సీతాలు ఆత్మకి నిజంగానే రెక్కలు వచ్చి శరీర పంజరంలోంచి ఎగిరిపోయింది.

ఈ నిజం తెలియని రాజ్యం ఆశగా నిరీక్షిస్తూనే ఉంది.

తెలిసిన వేప చెట్టు మాత్రం కన్నీళ్లు కురిపించింది.

★

## 960 మిలియన్ల నిరక్షరాస్యులు

ఈ విశాల భూ ప్రపంచం సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందుతున్నా అంతే నిష్పత్తిలో నిరక్షరాస్యుల సంఖ్య గూడా పెరుగుతోంది. వెనుకబడిన, అభివృద్ధి చెందుతున్న దేశాలలో 100 మిలియన్ల బాల బాలికలకు ప్రాథమిక విద్య అందుబాటులో లేదు. 960 మిలియన్ల వయోజనులకు విద్య గురించి తెలీదు. ఇందులో మూడింట రెండు వంతుల మంది స్త్రీలు. ప్రపంచ జనాభాలో మూడో వంతు మందికి అక్షర పరిజ్ఞానం ఉన్నా ముద్రణ గురించి ఎంత మాత్రం తెలియదు. ఇంకా వీరికి ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి, సామాజిక, జీవన రంగాలలో జరుగుతున్న మార్పులు గురించి కూడా తెలియదు. చాలా మంది మొక్కుబడిగా పాఠశాలలకు వెళ్ళినా తగినంత పరిజ్ఞానం మాత్రం నేర్చుకోవడం లేదు.

లత

## అమ్మకానికి్కాదేదీ అనర్హం!!


రోజు రోజుకీ వాతావరణ కాలుష్యం, ధ్వని కాలుష్యం ఎక్కువైపోతోంది. క్రమంగా మనిషి అడవులలోను, పడవలలోనూ నివసించే రోజులు వస్తున్నాయా అనిపిస్తున్నది.

పారిస్‌కు దగ్గరలో ఒక నదిలో అలల మధ్య తేలుతున్న హౌస్ బోట్‌లో ఒక కుటుంబం నివసించడానికి కావలసిన అన్ని సదుపాయాలూ ఉన్నాయి. రెండు పడక గదులు, ఓ హాలు, ఓ డ్రాయింగ్ రూమ్, ఫర్నిచర్, ముందు ఖాళీ స్థలం కూడా ఉంది. దీనిని తొంభై వేల డాలర్లకైతే అమ్ముతానంటున్నాట్ట ఆ హౌస్ బోట్ ఓనరు. కానీ ఇంత వరకు కొనడానికి ఎవరూ ముందుకు రాలేదు. కాస్ట్లీ కదా!!

ఈ మధ్య అగ్ని పర్వతాలను కూడా అమ్మేస్తాం అంటున్నారు. కానరీ దీవులలో ఒక అగ్ని పర్వతం అమ్మకానికి సిద్ధంగా ఉంది. ఇది అట్టే ప్రమాదకారి కాదని అంటున్నారు. చూడడానికి బోర్లించిన గరాటు మాదిరి ఉండే ఈ అగ్ని పర్వతంపై రకరకాల పండ్ల చెట్లతోపాటు రెండు గదుల ఇల్లు కూడా ఉందిట. ప్రేమికులు రహస్యంగా కలుసుకోవడానికి మంచి అనువైన స్థలం అంటున్నారు అమ్మకందారులు. ఖరీదెంత? అంటే లక్షా తొంభై ఐదు వేల డాలర్లు అంటున్నారు...!!... బాప్రే...

పసిఫిక్ మహా సముద్రంలో ఏకంగా ఒక దీవే అమ్మకానికి సిద్ధంగా ఉంది. రెండు లక్షల డెబ్బయ్ అయిదు వేల డాలర్లు ఖరీదు చేసే దీవిలో 138 అడుగుల ఎత్తు, ఒకటిన్నర ఎకరాల విస్తీర్ణం కల పెద్ద గ్రెనేడ్ రాయి ఉంది. 1880 లో మిలిటరీ ఇంజనీర్లు మూడు అంతస్థుల లైట్ హౌస్ నిర్మించారు. ఇందులో నాలుగు పడక గదులు, ఒక పెద్ద వంట గది, స్టోర్ రూమ్ మొదలైనవి ఉన్నాయి.

లక్షలాది ఎకరాల విస్తీర్ణాన్ని ఆక్రమించిన "హంటింగ్ కేంప్" ఒకటి అమ్మకానికి ఉంది. ఇది కెనడాకు చెందిన బ్రిటిష్ కొలంబియాలో ఉత్తర భాగాన ఉంది. ఇక్కడ నివసించేందుకు చక్కని ఇల్లేకాక ఒక ప్రైవేట్ విమానాశ్రయం కూడా ఉంది. ఈ హంటింగ్ కేంప్ ఖరీదు కేవలం 1.5 మిలియన్ డాలర్లని చెబుతున్నారు అమ్మకందార్లు.




లోయలు, పర్వతాలు పచ్చిక బయళ్లతో నిండిన ఈ కేంప్‌లో అడవి గొర్రెలు, తెల్లని ఎలుగుబంట్లు ఎక్కువ.

వెస్ట్ ఇండీస్‌లోని జమైకాలో మరొక విడిది ఉంది. దీని వెల 560 వేల డాలర్లు. ఇందులో చాలా వసతి గృహాలు ఉన్నాయి. ఏ ఇంటి నుంచి చూసినా అల్లంత దూరంలో బీచ్ కనిపిస్తుంది. ఎండ కోసం తపించి పోయే వారు ఆ బీచ్‌కి వస్తారు. సుందరమైన ఆ బీచ్‌ని చూడడం కోసం చాలా మంది వచ్చి ఈ విడిదిలో బస చేస్తుంటారు.

ఒరెగాన్ అనే పట్టణాన్ని 1951 లో నిర్మించారు. అప్పట్లో ఇది ఎయిర్ ఫోర్స్ రాడార్ స్టేషన్‌గా ఉండేదిట. ఇప్పుడు ఇది కూడా అమ్మకానికి వచ్చింది. ఈ పట్టణం విస్తీర్ణం 79 ఎకరాలు. ఇందులో 27 ఆధునాతన గృహాలు, చక్కని రోడ్లు, ఆట స్థలాలు ఉన్నాయి. సినిమా థియేటర్లు, పోస్టాఫీసులు, ఆఫీసర్ల క్లబ్బులు, ఫోటో స్టూడియోలు, లైబ్రరీలు, రెస్టారెంట్లు, చర్చి, స్కూలు ఉన్నాయి. ఈ పట్టణం వైశాల్యం అరవై వేల చదరపు అడుగులు. ఇందులో కమర్షియల్ ఇండస్ట్రియల్ సెక్షన్ కూడా ఉంది. ఇంతకీ ఈ పట్టణం ఖరీదెంతో తెలుసా... కేవలం 1.2 మిలియన్ డాలర్లు మాత్రమే...

-"రవీంద్ర"